

# బురద

ఏ ఒక్క కలువ పువ్వయినా వికారంగా ఉంటుందా.
ఏ ఒక్క కమలమైనా వికృతంగా ఉంటుందా.
కలువ చంద్రుడితో..కమలం సూర్యునితో ఆత్మానుబంధాన్ని కలిగి.. ఈ వైరుధ్యాలేమిటి? తామరపువ్వుగానీ, కలువగానీ సాధారణ మట్టిలోనో, ఏ సారవంతమైన నేలలోనో, బంగారంలోనైనా పాదుకుని ఎదిగి వికసించగలవా. వాటి సహజ జన్మస్థలం బురదేకదా. బురదలోనే పుట్టి బురదలోనే పెరిగి, బురదలోనే వికాసంచెంది...బురద..బురద.. బురద...

* * *

26 నవంబర్ 2008 :
రాత్రి పన్నెండు గంటల ఏభై ఐదు నిముషాలు.
మచిలీపట్నం ఎక్స్‌ప్రెస్ ఉరుముకుంటూ పరుగెత్తుతోంది.

అన్‌రిజర్వ్‌డ్ కంపార్ట్‌మెంట్‌లో కాలుమోపడానికి స్థలంలేదు. కోళ్ళగంపలోవలె ఒకరిపై ఒకరు..ఒకర్ని ఒరుసుకుంటూ మరొకరు. నిద్రలో తూగుతూ..కత్తిలా కోస్తున్న చలికి గజగజా వణికిపోతూ..

కిటికీ సందుల్లోనుండి దూసుకొస్తున్న ఈదురు గాలికి గడ్డకట్టిపోతున్నట్టు ఎవరికివారు ముడుచుకుపోతూ., టక్‌టకా, టక్‌టకా..పట్టాల భీకర శబ్దం.

మిగతా అంతా నిద్రముద్ర...

ఒక చేయితో లగేజ్ ర్యాక్ రాడ్‌ను ఒడుపుగా పట్టుకుని నిలబడ్డ తేజ కొద్దిగా కదిలి శరీరభారాన్ని ఒక కాలిపైనుండి మరోకాలిపైకి మార్చుకుంటూ..

ర్యాక్‌పై తన ప్లాస్టిక్ సంచీ కనబడింది. అందులో నుండి తొంగిచూస్తూ ఎర్రని గులాబీ పూలదండ..ప్రక్కనే ఒక శాలువా..లోపల ఒక కాగితపు చుట్ట.. చుట్టూ రిబ్బన్..సైటేషన్..,

అప్రయత్నంగానే జేబును తడుముకున్నాడు తేజ.

ప్లాస్టిక్ డబ్బా ఒకటి చేతికి తగిలింది. అందులో బంగారు పతకం.

ఆ పూటంతా ఎంతో ఉద్విగ్నంగా ఉన్న అతని మనసు మళ్ళీ కల్లోల సముద్రమైంది. అలలు. అలలు..ఉవ్వెత్తున లేస్తున్న అలలు..ఆటు పోటు..ఉత్థాన పతనాలు..పడి, లేచి..మళ్ళీ పడి..మళ్ళీ లేచి..నడక..నిటారుగా నడక.. తలెత్తుకుని గమ్యంవైపే విడిచిన బాణంలా నడక,

ఎప్పటినుండీ నడక..

ఐదవక్లాస్‌లో తెలుగుసార్ రాఘవరెడ్డి అర్జునుని కథ చెప్తూ బాణం ఎక్కుపెట్టిన తర్వాత 'ఏం కనిపిస్తోందిరా' అని ద్రోణుడడిగితే..అర్జునుడు.. 'ఒక పక్షి కన్ను తప్ప మిగతా ప్రపంచమేదీ కనబడ్డలేదని' చెప్పిన జవాబు తన నరనరాన ఒక విద్యుత్ సముద్రమై విస్తరించి..గమ్యం వైపే నడక..గమ్యం వైపే చూపు- గమ్యాన్ని చేరడమే తపస్సు

జీవితమంటే తాడుపై నడక..అదుపు తప్పితే పడిపోవడమే..సార్ చెప్పిన ఉత్తేజపూరితమైన ప్రేరకవాక్యాలు..

గమ్యం..గమ్యం..ఏది గమ్యం.

ఎస్సెస్సీ..రాష్ట్రస్థాయి ఫస్ట్‌ర్యాంక్..ఇంటర్..మళ్ళీ స్టేట్ ఫస్ట్‌ర్యాంక్.. ఇంజినీరింగ్..యూనివర్సిటీ ఫస్ట్..యిప్పుడు ఎమ్టెక్‌లో...కంప్యూటర్ సైన్స్ శాఖలో జెఎన్‌టియు యూనివర్సిటీ ఫస్ట్..బంగారు పతకం..

ఇవన్నీ విజయాలేనా? ఇప్పుడు తన గమ్యం స్పష్టపడిందా..తనను తాను సమగ్రంగా నిర్వచించుకున్నాడా...తాను ఏంకావాలనుకున్నాడో తనకు తెలుసా. తను ఏమి కాకూడదనుకున్నాడో ఎప్పుడైనా ఆత్మ విమర్శ చేసుకున్నాడా. ఒక్క తనేకాదు తనలాంటి ఏ యువతీ యువకుడైనా తన జీవిత లక్ష్యాలను

స్పష్టంగా నిర్దేశించుకుంటున్నారా.

ఇంజినీరింగ్..డిగ్రీ ఔతుండగా క్యాంపస్ ప్లేస్‌మెంట్..జిఆర్ఇ టోఫెల్..ఎమ్మెస్..చలో అమెరికా...వీసా స్టాంపింగ్..హెచ్‌వన్‌వీసా...డాలర్..డాలర్ స్వప్నాలు..సాఫ్ట్‌వేర్ ఉద్యోగం..అందమైన ఉద్యోగం..అందమైన జీతం..అందమైన పెళ్ళాం..అందమైన పిల్లలు..ఆకర్షణీయమైన బ్యాంక్ బ్యాలన్స్‌లు.

..తర్వాత..పూర్ తల్లిదండ్రులు - డర్టీ ఇండియా..లెట్ ఎవ్రీథింగ్ గో టు డాగ్స్ - మన ఆనందం మనది.

ఎవరికైనా గమ్యం ఇదేనా..

ఆకస్మాత్తుగా రైలు కీచుమని శబ్దం చేస్తూ వేగం తగ్గించుకోవడం ప్రారంభించిది. ప్రయాణీకులంతా ఓ కుదుపుకు లోనై.. ఎవరో కిటికీ తెరిచారు బయటికి చూస్తూ, సర్రున చలి పులిలా చొచ్చుకొచ్చింది.

'వరంగల్ స్టేషన్ ఔటర్‌యార్ట్‌లో ఉంది బండి..'

టైం చూచుకున్నాడు తేజ. ఒకటీ ఇరవై..

జనంలో కోలాహలం..సంచులు, తువాళ్లను విదిలించడాలు..నిద్రలో జోగుతున్నవాళ్ళను పిలవడాలు...వాతావరణం ఒక్కసారిగా తుపాకీ గుండు శబ్దం విన్న చెట్టుపై పక్షుల్లా మారింది.

తేజకు..మూడు గంటల క్రితం వేలమంది సమక్షంలో 'స్వర్ణ పతకాన్ని' స్వీకరించేందుకు యూనివర్సిటీ ఆడిటోరియంలో వేదికపైకి నడుస్తున్నప్పటి చప్పట్ల హోరు చెవుల్లో మారుమ్రోగింది. గొప్ప ఉత్కంఠ..ఉద్వేగం..నరాల్లో ఏదో ఉద్రేకం...విజయాన్ని సాధిస్తూ ఒక ఉన్నతమైన మెట్టుపైకి కాలిడుతున్నప్పుడు కలిగే భాషకందని ఒక మహానందం.

దీంతో తన లక్ష్యించిన చదువు పూర్తయ్యింది.

యిప్పటికి చేతిలో 'మైక్రోసాఫ్ట్'లో ఉద్యోగం, రీసర్చ్ చేసుకోవడానికి సౌకర్యాల హామీ, ప్రయాణానికి విమాన ఖర్చుల ఏర్పాటు, అమెరికాలో ఉంటానికి 'ఎ' క్లాస్ వసతి..కాని.,

ఇదే తన గమ్యమా..ఇక్కడితో తన లక్ష్యం నెరవేరినట్టేనా..,

రెక్కలు మొలవగానే పిల్లపక్షి రివ్వున ఎగిరి ఆకాశంలోకి ఎగిరిపోతుంది గదా.. యిక తన చెట్టు, తన గూడు తన కన్న తల్లిదండ్రులు..వాటి సంగతి,

యిక్కడి ఈ నేల, ఈ గాలి, ఈ ఊరు, ఈ రోడ్లు.. ఈ దేశం.,

ఒక మొక్క మొలవాలంటే..భూమి, నీరు, గాలి, వెలుతురు, మాలి యిన్ని తోడైతేగదా అది చెట్టుగా ఎదుగుతుంది..తను ఈ స్థితికి రావడానికి..తన తల్లిదండ్రులు, తన గురువులు, తన మిత్రులు, తన సమాజం, తన దేశం..ఎందరిదో చేయూత ఉందికదా..వాళ్ళందరిపట్ల ప్రతికృతి, కృతజ్ఞతాపూర్వమైన ప్రతిస్పందన తన వైపునుండి ఏమీ ఉండకూడదా. ఉంటే ఎలా..ఏరకంగా,

ఏరూపంలో..ఎప్పుడు-

తేజలోపల ఏదో నిప్పు అంటుకుంది. దహనం జరుగుతోంది. స్పష్టంగా తెలుస్తోంది తనలో ఏదో ఒక భీకర అంతర్యుద్ధం జరుగుతోందని.

బురద..బురద...బురద,

యిప్పటి యువతకు కెరీర్‌మాత్రమే కావాలి. క్యారెక్టర్ వద్దు.

రైలు ప్లాట్‌ఫాం నంబర్ వన్‌పై మెల్లగా కదుల్తూ ఆగుతోంది.

బయట తెల్లగా దట్టమైన పొగమంచు. బిలబిలా జనం ఒకర్నొకరు తోసుకుంటూ..

తేజ చేతిలో ప్లాస్టిక్ సంచీతో దిగాడు. చలి విపరీతంగా ఉంది. పొగమంచు యింత విపరీతంగా వరంగల్‌లో వ్యాపించి ఉండడం యింతకుముందెన్నడూ చూడలేదు తను. పదిగజాల అవతల ఫ్లాట్‌ఫాంపై ఏముందో కనిపించడంలేదు. తెల్లని మంచు, గాఢనలుపు చీకటి.

మనసునిండా అర్థంగాని అశాంతి. యిక తను ఏదో ఒక కీలకమైన నిర్ణయం తీసుకోవాల్సిన సమయం ఆసన్నమైందన్న స్పష్టమైన స్థితి.. ఏంజేయాలి.. ఏంజేయాలికముందు తను..? ప్రశ్న.

శరీరం చుట్టూ అమ్మ వాత్సల్యం వలె ఆవరించిన శాలువ ఏదో అవ్యక్త వెచ్చదనాన్ని అందిస్తోంది.

నాల్గడుగులు వేసి ఫ్లాట్‌ఫాంపై ఉన్న గద్దెపై కూర్చున్నాడు. చూస్తూండగానే అనౌన్సర్ ఏదో వినిపిస్తూండగా రైలు కదిలి వెళ్ళిపోయింది. ఐదు నిముషాల్లో ఫ్లాట్‌ఫాం అంతా ఖాళీ. అటు శివనగర్‌వైపు ఏమీ కనిపించడంలేదు. యిటు రైల్వేగేటు దిక్కు పొగమంచులో చిక్కుకుని ఎర్రని సిగ్నల్‌లైట్లు విలవిల్లాడుతూ దీనంగా..

మంటకూడా చలికి వణికి ముడుచుకుపోతుందా?

మళ్ళీ బురద జ్ఞాపకమొచ్చింది తేజకు. బురదతో పాటు బురదలోనుండి మాత్రమే పుట్టే కలువ, తామర.. నిర్మలమైన పుష్పకాంతి.. తెల్లనినవ్వు.. లేత ఎరుపు తేజం.,

బురదే.. తన చుట్టూ అంతా బురదే.. చిన్ననాటినుండీ గమనిస్తున్నాడు తను.. తన ఇంట్లో స్వాతంత్ర్య సమరయోధుడైన తాత, నాన్నమ్మ తప్పితే నాన్న అవినీతిపరుడు, అన్నయ్య పరమ లంచగొండి, అక్కయ్య హైలీ కరప్టివ్.. వీళ్ళందరూ లంచాల రూపంలో, కమీషన్ల రూపంలో, పర్సెంటేజీల రూపంలో తెస్తున్న డబ్బును మహదానందంగా స్వీకరిస్తూ సొమ్ములు, చీరలు, సౌకర్యాలను అనుభవిస్తున్న అమ్మ, వదిన, బావ.. వీళ్ళందరూ బురద..తన ఇంటినిండా బురదే..చిక్కని బురద..ఎంత శుభ్రం చేసినా అస్సలే తరగని డాంబర్‌వంటి బురద.

నాన్న సూపరింటెండెంట్ ఇంజినీర్. రోడ్లు, భవనాలు, వంతెనలు, డ్యాంలు..కాలువలు..అన్నింటోనూ కమిషన్లు. మంత్రి ఫోన్‌చేసి 'ఆ ప్రాజెక్ట్ ఎస్టిమేషన్‌ను పదికోట్లు పెంచు'అంటాడు - నాన్న ఒక కోటి తను తిని మిగతా అంతా తలా యింత పందేరం. ఈరోజు వేసిన రోడ్లు మూడు నెలలకే మటాష్.. అంతా బురద.

అన్నయ్య ఎక్సైజ్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్. వైన్ షాప్‌లూ, బార్లూ అన్నీ కలిసి నెలకు పదిలక్షలు అన్నయ్య వాటాను చెల్లిస్తాయి. వ్యాపారులందరూ 'రింగై' ఎమ్మార్పీపై పదిశాతం పెంచి అమ్మకాలు..లైసెన్స్‌లేని బెల్టు షాప్‌లు పట్టణ మూలమూలలా విస్తరణ. జీరో స్టాక్ రెక్కలు వచ్చి ప్రవహించడం..వెరసి అంతా చిక్కని బురద.

అక్కయ్య ఎమ్మార్వో. భూములు..ప్రభుత్వ భూములను కార్పొరేట్ సంస్థలకు, పేదల భూములను పెద్ద మనుషులకు, కోతిని హనుమంతుణ్ణి చేసి హనుమంతుణ్ణి ఒట్టి బోడమర్కటంగా చేయడంలో దిట్ట. లా కూడా చేసింది కాబట్టి అన్ని అవినీతిపనులనూ పకడ్బందీగా, కాగితమ్మీద ఎవడి బాప్‌కైనా పట్టుబడకుండా అంతా సవ్యాపసవ్యసవ్యం. ఎక్కడి దొంగలు అక్కణ్ణే గప్‌చిప్.. లంచాలు పట్టుచీరల దగ్గర్నుండి దేశవ్యాప్తంగా బినామీ పేర్లతో భూములే భూముల రూపంలో..అవినీతి వరద గోదావరి.

ఒక్కొక్కరికి ఎక్కడెక్కడో యిరవై ముప్పయి బ్యాంక్ అకౌంట్లు. పదుల యిరవైల సంఖ్యలో లాకర్లు. లాకర్లలో బంగారు బిళ్ళలు, కడ్డీలు, చీకిపోతున్న వేయిరూపాయల నోట్ల కట్టలు.

అంతా బురద..పుట్టిన దగ్గర్నుండీ ఆ బురదలో పెరిగి బురదలో ఎదిగి.. బురద యొక్క సర్వ దుర్గంధ స్వభావ స్వరూపాలనూ ఎరిగి, బురదను ధరిస్తూ, బురదను భరిస్తూ..బురదలో పందివలె దొర్లుతూ..ఛీ ఛీ...

ఈనాటి వరకూ తన నేపథ్యం అవినీతి, తన వారసత్వం లంచగొండితనం, తన చరిత్ర పరమ కంపుగొట్టే కాగిబంగారపు జలతారు.. తారు..తారు..డాంబర్..బురద...బురదే తన పూర్వీకులనుండి సంక్రమించిన వారసత్వం.

'ఎప్పుడూ మౌనంగా ఉంటావేమిట్రా..ఏదో పోగొట్టుకున్నవానిలా.. ఏం తక్కువైందని నీకు. ఎంజాయ్ మ్యాన్..జీవితం మనిషికి దేవుడిచ్చిన అపూర్వమైన వరం..ఎంజాయిట్...' అంటాడు నాన్న..అని ఎక్కడికో తుర్రుమంటాడు..అతనికి రోజుకు యిరవై నాలుగ్గంటల కాలం చాలదు. ఆల్వేస్ ఎంగేజ్డ్. అన్నయ్యా అంతే. రాత్రి ఒంటిగంటదాకా పార్టీలు..మధ్యాహ్నం పన్నెండు గంటలకు లేవడాలు, తర్వాత డబ్బు లెక్కలు..అక్కయ్యకు క్యాంప్‌లు, మహిళా సంఘాలు, ప్రసంగాలు, స్త్రీవాద చర్చలు, బుద్ధిపుడ్తే ఏ అకార్యమైనా చేయగల అనైతిక వ్యక్తిత్వం..అందరి

ఇండ్లలో డబ్బు..డబ్బు..డబ్బు వాసన..బురద కంపు.

చిన్ననాటినుండీ రగులుతున్న ఈ రాక్షసి బొగ్గు విజృభించి ప్రజ్వరిల్లుతోందిప్పుడు.

తేజ సిమెంట్ గద్దెపైనుండి లేచి బయటకువెళ్ళే దారివైపు నడిచాడు. మనిషి ఒక నడుస్తున్న అగ్నిశిఖలా, నిటారుగా, నిలకడగా, స్థిరంగా..అడుగులు పిడుగులై పడ్తున్నాయి.

ఫ్లాట్‌ఫాంనిండా...చుట్టూ అంతా చిక్కని పొగమంచు. ఏమీ కనబడ్డం లేదు. ఫుట్‌బ్రిడ్జ్ దాటుతూండగా..వ్రేలాడ్తున్న టి.విలో తాజ్ హోటల్‌పై ఉగ్రవాదుల దాడి దృశ్యాలను చూపిస్తున్నారు.

చేష్టలుడిగి, నిస్సహాయులై, అనివార్యమై భారత జాతియావత్తూ స్తంభించి ఉత్కంఠగా చూస్తున్న ఒక సందిగ్ధ సందర్భంలో..ఎర్రని మంటల్లో చిక్కుకుని వందేళ్ల చరిత్రగల 'తాజ్'. స్క్రోలింగ్ పోతోంది. అప్పటికే అమరులైన హేమంత్ కర్కరే, హవల్దార్ గజేంద్రసింగ్, మేజర్ సందీప్‌లు.

ఎవరు ఎవరికోసం బలైపోతున్నారు..ఎవరు ఏ పవిత్ర లక్ష్యం కోసం ప్రాణాలను ధారపోస్తున్నారు.

తెల్లారి లేస్తే పశువులకంటే హీనంగా బూతులు మాట్లాడుకుంటూ, పార్లమెంట్‌లో శాసనసభల్లో కుర్చీలను, మైక్‌లను విరగ్గొడ్తూ, అంగీలను చింపుకుంటూ, 'కుర్చీ'లను కాపాడుకోవడం కోసం వివిధ రకాల వింత పొత్తులకు పాల్పడ్తూ...ఎవరో కవి అన్నట్టు,

'కేంద్రంలో మిత్రులు..రాష్ట్రంలో శత్రువులు

తల చెల్లెలు

మిగతా శరీరం మరదలు '-థూః...నీతిహీనమైపోయింది రాజకీయం. అసమర్థులు కుర్చీలలో, వెధవలు అధికార హోదాల్లో..సుశిక్షితులైన సైనికాధికారులు కూడా మంత్రిగా మారిన ఏ వీధిగూండా అనుజ్ఞల కోసమో ఎదురుచూపు,

లేకుంటే..,భారత ఆర్థిక రాజధాని ముంబై తాజ్‌పై ఉగ్రవాదులు దాడిచేస్తే ఎదుర్కొనే యంత్రాంగమే మహారాష్ట్ర ప్రభుత్వం దగ్గర లేకపోవడం ఎంత సిగ్గుచేటు.. ఎన్ఎస్‌జీ కమెండోలు ఢిల్లీనుండి రావడానికి నాలుగ్గంటల విలువైన సమయం వృధా..ఏమిటీ అలసత్వం, ఏమిటీ అసమర్థత..ఏమిటీ ఉపేక్ష.. అసలు ప్రభుత్వాలున్నాయా- యిక్కడి పౌరులకు భద్రత ఉందా..,ఎవరికైనా. ఈ దేశవీధుల్లో నడిచే పౌరులకు హామీ యివ్వగల రక్షణ ఉందా.

టి.వి. నిండా తుపాకీ తూటాల ధ్వని. ఎవరీ ఉగ్రవాదులు.. ఎక్కడినుండొస్తున్నారు. ఓటు బ్యాంక్ రాజకీయాలతో సుప్రీంకోర్టు ఆదేశించినా పార్లమెంట్‌పై బాంబు దాడిచేసిన అఫ్జల్ గురును ఉరితీయకుండా ఏమిటీ ఉపేక్ష..

రాజకీయాలు యింత నీతిమాలిన వ్యవహారాలుగా మారిన తర్వాత పూర్తిగా పాలనావ్యవస్థ శునకక్రీడగా మారింది.

భారత ప్రజల ప్రైవేట్ జీవితాల్లోకి రాజకీయాలు రాక్షసంగా ప్రవేశించి బతుకులను ధ్వంసం చేస్తున్నాయి కదా.,

అడగముందే ప్రజలకు ఉచిత బియ్యం..ఉచిత విద్యుత్తు, ఉచిత టి.విలు, గడప దాటగానే చేయిచాపితే అందే దూరంలో ఏరులై పారే మద్యం.,

ఊపిరి పీల్చుకోడానికి సినిమాకు వెళ్తే...పదవ క్లాస్ పోరడూ, పోరీ విపరీతంగా ప్రేమించుకుని లేచిపోవచ్చనీ, ఒకరి ఒంటినొకరు నలుపుకోవచ్చని బోధించే సినిమాఖండాలు,

ప్రజలను తాగుబోతులను చేసి వేలకోట్ల సంపాదనతో, ప్రజల భూములను దొడ్డిదారిన అమ్ముకుని తినగల్గినంత తిని మిగిలిన డబ్బుతో ప్రభుత్వాలను నడిపే రాజకీయ పార్టీలు, యిక్కడి బీదవాడంటే...బిచ్చగాడుగా నిర్వచించబడ్తున్నాడు.

ప్రజలపై ఓ నాల్గు కుటుంబాలు తను విష పంజాను విసిరి ఆంధ్రదేశాన్ని కబళించాలని చేసే ఎత్తులను, వాళ్ళు చేసే దొంగ ఉపన్యాసాలను, కుట్రలను ఈ జనం ఎందుకు గ్రహించడం లేదు.

ఒక మాయవల విసరబడ్తోంది ఈ ప్రజలపైకి.

ప్రజలకు నిద్ర అలవాటు చేసి, నిద్రిస్తున్న వాడి ముక్కు దగ్గర క్లోరోఫాం పెట్టి...బహిరంగ దోపిడి జరుగుతోందిక్కడ.

టి.వీలూ అంతే...ఏవేవో శీర్షికల కింద పరమ బూతు, వికారమైన యాంకర్ల చేష్టలు, వంకర్లు పోయే నృత్య విన్యాసాలు..ఛీ ఛీ...

ప్రజలు రెండు సామాజిక ప్రపంచాలుగా విడిపోతున్నారు...లక్షలకు లక్షలు సంపాదించే అవినీతిపరుల వర్గం ఒకటి...అమెరికా వెళ్ళిన పిల్లలు పంపుతున్న డబ్బు ఒక మిథ్యా ప్రపంచాన్ని అల్లుతున్న వర్గం మరొకటి...ఎంత శ్రమించినా నెలకు మూడు నాల్గు వేలుకూడా సంపాదించలేని అట్టడుగు మధ్యతరగతి వర్గం ఇంకొకటి..అన్నీ ప్రలోభాలు..నిశ్శబ్ద మౌన దుఃఖాలు.. లోలోపల అగ్నిపర్వతాలై మరిగిపోవడాలు...చటుక్కున ఉరితాడుకు వ్రేలాడి ప్రత్యక్షమయ్యే అభాగ్యుల శవాలు.

వేల, లక్షల కోట్ల ప్రాజెక్టుల పేర బహిరంగ దోపిడి జరుగుతూంటే ఈ ప్రజలు ఎందుకు మౌనంగా, నిస్సహాయంగా ఉదాసీనంగా ఉండవలసి వస్తోంది.

ప్రజలు గొర్రెలా..

గొర్రెలు మందగా కాకుండా విడివిడిగా, విచ్చలవిడిగా నిస్సహాయంగా నిలబడి దిక్కులు చూస్తున్నాయా... వీటిని ఒక మందగా కూర్చగలిగితే..,

గొర్రెలు బురదలో నిలబడి, బురదలో కూరుకుపోయి ఉన్నాయా.,

అది బురదా..ఊబా...

తేజ వరంగల్ రైల్వే స్టేషన్‌నుండి బయటికి వచ్చాడు. తన ఇల్లు బ్యాంక్ కాలనీలో...ఎవరో ఆటోవాడు అడుగుతున్నాడు.

తేజ మనస్సు అంటుకున్న పెట్రోల్ బావిలా ఉంది. శాలువాను సవరించుకుని, ప్లాస్టిక్ సంచీని పట్టుకుని అనాలోచితంగానే నడుస్తున్నాడు. బస్‌స్టాండ్, ఇన్‌కంటాక్స్ బిల్డింగ్, సూర్య హోటల్...అడుగులు పడ్తున్నాయి.

చుట్టూ విడివడని దట్టమైన పొగమంచు..నిశ్శబ్దంగా నిద్రిస్తున్న స్టేషన్ రోడ్డు.

ఆంధ్రదేశం మొత్తం మీద ఆరువందలపైగా ఇంజినీరింగ్ కాలేజీలు. దాదాపు ఎనిమిదివందల ఎమ్బీయే, ఎమ్సీయే కాలేజిలు...ఏ ఒక్కదాంట్లో పాఠాలు చెప్పే పంతుళ్ళు లేరు. ఏ నగరానికి వెళ్ళినా పొద్దున లేవగానే రోడ్లపై యమభట వాహనాల్లా ఈ విద్యాసంస్థల బస్సులు..ఈ లక్షలమంది ఇంజినీర్లు, మేనేజ్‌మెంట్ పోరగాండ్లు బయటికొచ్చి ఏమౌతారు. వీళ్లకు ఉపాధి ఎక్కడుంది. రాబోయే రెండు మూడేండ్లలో కుప్పకూలబోయే ఉపాధి వ్యవస్థలో యువతరం పిచ్చోళ్ళై వీధినబడ్తారా. అమెరికా సంక్షోభం తర్వాత ఈ కెరీర్ వేటగాండ్లు ఎక్కడ బిచ్చమెత్తుకుంటారు.

వాకింగాన్ రోప్..లివింగాన్ ద ఎడ్జ్..కుప్పకూలుతుందా వ్యవస్థ.?

అనుత్పాదక, జనాకర్షక పథకాల కోసం లక్షలకోట్ల రూపాయల అప్పుతెచ్చిన ప్రభుత్వాలు ఆత్మహననంతో ధ్వంసమై పోతాయా?

ప్రజలను పరాన్నభుక్కులుగా మార్చిన దుష్ట రాజకీయపార్టీలు కాలప్రవాహంలో కొట్టుకుపోతాయా?

తేజ నడుస్తున్నాడు..నిశ్శబ్దంగా

పోస్టాఫీస్, అకారపోళ్ళ గుడి, చౌరస్తా...అంతా నిర్మానుష్యం. ఎక్కడినుండో ఓ కుక్క కుఁయ్‌మని అరుచుకుంటూ రోడ్డు యిటువైపు నుండి అటు పరుగెత్తింది.

మళ్ళీ ఆలోచనల వర్షం.,

తను బి.టెక్ మొదటి సంవత్సరం నుండి తనవంటి ఒక ప్రత్యేకమైన ఆలోచనలుగల పది పదిహేనుమంది స్నేహితులను తయారుచేస్తూ వస్తున్నాడు. తాము ఎప్పుడు కల్సుకున్నా..ఈ దిక్కుమాలిన సెల్‌ఫోన్ల చర్చ, ఇంటర్‌నెట్ బూతుసైట్ల అన్వేషణా, కాలేజీలంటే ప్రేమాయణాల వేదికే అని విడమర్చి చెప్పే పాడు సినిమాలు..వీటి జోలికి పోని ఒక కోర్ గ్రూప్ తమది. పదిహేను మందీ ఒక్కటే...ప్రతి ఒక్కడూ పదిహేనుమంది.

మనిషి ఒక్కడే దేన్నయినా సాధించగలడా..'మ్యాన్ ఎలోన్ ఈజ్ వెరీ వీక్ అండ్ ఎక్స్ట్రీమ్లీ పవర్‌ఫుల్' అనిగదా సూక్తి.

ఒక్క మావో, ఒక్క లెనిన్, ఒక్క కాస్ట్రో, ఒక్క అలెండీ, ఒక్క స్పార్టకస్, ఒక్క చేగువెరా.. ఒక్క గాంధీ.. ఒక్క జయప్రకాశ్ నారాయణ.

వీళ్ళందరూ ఒంటరి... ఒక్కరేగదా..

ఇక్కడీ దేశంలో రాజ్యాంగం అన్నీ ఇచ్చింది కాని అమలులో అన్నీ మృగ్యం.

చివరికి అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు 'ఇక ఈ దేశాన్ని దేవుడుకూడా రక్షించలేడని' వాపోయింది. యువనేత రాహుల్‌గాంధీ ఈ దేశంలో కట్టలు తెంచుకున్న అవినీతిగురించి వివరిస్తూ ప్రభుత్వ పథకాల్లోని ఒక రూపాయి లబ్దిదారునికి ఐదుపైసలై చేరుతోందని స్వయంగా ప్రకటించాడు. కుర్చీలన్నీ వృద్ధ రాజకీయ జంబుకాల ఆక్రమణలలో నిండిపోయాయి. యువతరానికి డాలర్ స్పృహ, సెక్స్ స్పృహ, మందు స్పృహ తప్పితే రాజకీయ ఆసక్తులు లేవు.. దేశ స్పృహ లేదు.

ఏమిటీ నిస్తేజం..ఏమిటీ నిర్వీర్యత..

ఒక పద్ధతి ప్రకారం యిక్కడి రాజకీయులు ఈ తరాన్ని, ఈ సమాజాన్ని, ఈ దేశాన్ని ఒట్టి బీడుగా మారుస్తుంటే...

మౌనంగా చూస్తూ చేష్టలుడిగి కూర్చోవడమేనా.?

స్టేట్‌బ్యాంక్, నిర్మలా కాంప్లెక్స్, మండిబజార్..పోచమ్మమైదాన్.. నడుస్తున్నాడు తేజ ఒంటరిగా..చలిలో..పొగమంచులో...

సమాచార చట్టం ఒక విప్లవం కదా..మొన్న ఆరండ్‌బీలో కష్టపడి ఒక కాగితం సంపాదించాడు తను. భట్టుపల్లి దగ్గర ఓ కొత్త రోడ్డు. ఎనిమిది లక్షలు ఎస్టిమేషన్.. మర్నాడు పోయి చూస్తే.. అసలు రోడ్డే లేదు. తర్వాత వాకబు చేస్తే అన్ని రికార్డ్స్ శుభ్రంగా ఉన్నాయి. రోడ్డు వేయబడ్డది. సూపర్‌వైజర్ చెక్ మెజర్ చేశాడు. ఎ.ఇ, డి.ఇ. సంతకాలు చేశారు. ఎస్సీ బిల్ శాంక్షన్ చేశాడు. కాంట్రాక్టర్ డబ్బులు తీసుకున్నాడు..అందరూ ఆనందంగా పంచుకున్నారు.

తేజ ఒక నిర్ణయానికొచ్చాడు పోచమ్మమైదాన్ 'రుద్రమదేవి' విగ్రహం వద్ద ఉన్నపుడు సెల్‌ఫోన్ తీసి ఎంజిఎం వద్ద ఉన్న ఒక దినపత్రికకు ఫోన్ చేసి ఎడిటర్‌తో మాట్లాడ్డానికి అర్జంట్‌గా అవకాశమిప్పించమని ప్రాధేయ పడ్డాడు. తర్వాత వడివడిగా అడుగులు వేసుకుంటూ..,

మర్నాటి దినపత్రికలో మిగతా దినపత్రికల్లోలేని ఒక కొత్త హెడ్‌లైన్ జనాన్ని కుదిపేసింది.

“ఇరవై మంది యువకుల సారథ్యంలో 'పౌర బాధ్యతల సంఘం ఆవిర్భావం' - అని.

* * *

జిల్లా కలెక్టర్, ఎస్పీ ఇద్దరూ కూర్చుని వాళ్ళ ఎదురుగా స్పెషల్ అపాయింట్‌మెంట్‌పై వచ్చి కల్సిన తేజ నాయకత్వంలోని ఇరవై మంది యువకుల 'పౌర బాధ్యతల సంఘం' సభ్యుల ప్రతిపాదనలను అతి శ్రద్ధగా వింటున్నారు.

'సర్..ప్లీజ్ సర్..ఈ దేశం ఈ రాజకీయ నాయకుల, కంట్రాక్టర్ల, రియల్ ఎస్టేట్ బ్రోకర్ల, అవినీతిపరులైన ప్రభుత్వాధికారుల కబంధ హస్తాల్లో బందీ ఐ ఉంది. దీన్ని విముక్తం చేయకుంటే ఈ దేశ ప్రజల భవిష్యత్తు చీకటిమయమై ధ్వంసమైపోతుంది. యిక్కడి పాలకులు, ప్రజలు, ఉద్యోగులు అందరూ అవసరానికి మించిన అదనపు స్వేచ్ఛా స్వాతంత్ర్యాలతో హద్దులు మీరి ప్రవర్తిస్తున్నారు. స్వతంత్రం క్రమంగా 'అరాచకత్వం'గా రూపాంతరం చెందుతోంది. వీటికి చెక్‌పెట్టి నియంత్రించే ఒక నిజాయితీతో నిండిన వ్యక్తుల సమూహం కావాల్సార్. మేము ఎటువంటి స్వార్థమూ లేకుండా యిక ప్రక్షాళన కార్యక్రమాణ్ణి చేపడ్తాం..మీరు మాకు ఊపిరిగా వెంట ఉండాల్సార్. రాజ్యాంగ పరిధిలో, చట్టాలకు లోబడి ఈ సమాజాన్ని ఆరోగ్యవంతం చేద్దాం..' చెప్పుకుపోతున్నాడు తేజ. అతనొక్కని కంఠమే గదిలో కంచుఘంటై వినిపిస్తోంది.

పావుగంట తర్వాత.. కలెక్టర్ లేచి వచ్చి తేజను కౌగలించుకుని... 'ఎప్పటినుండో నేను స్వప్నిస్తున్న ఒక మనిషి యిన్నాళ్ళకు నాకు కనబడ్డాడు తేజా..నీకూ, నీ మిత్రులకూ అభినందనలు. మీది ఒక అనంత నిరంతర సాహసయాత్ర. యువకులు మాత్రమే చేయగల ఒక దీర్ఘయజ్ఞం..మీవెంట మేమిద్దరం కంటికిరెప్పలా కాపలా ఉంటాం..యిదిగో మొదటి ప్రాజెక్టనిస్తున్నాను. సమాచార చట్టంక్రింద..యిది ఆజాద్ యిర్రిగేషన్ ప్రాజెక్టు. కాస్ట్ ముప్పయి కోట్లు. కాంట్రాక్టర్ మంత్రి బామ్మర్ది. యిదిగో యిది రెండు వందల టన్నుల బియ్యం యిరవై రూపాయలకు కిలో చొప్పున అమ్మవలసిన ప్రభుత్వ పంపిణీ పథక కాగితాలు. డిస్ట్రిబ్యూటర్ స్థానిక ఎమ్మెల్యే తమ్ముడు. వీటిని వెంట ఉండి అమలు చేయించి మీ ఆచరణాత్మక విప్లవాన్ని ఆరంభించండి. బెస్టాఫ్‌లక్.. వుయార్ విత్ యు ఆల్వేస్.."

తేజ శరీరంలోకి ఏదో విద్యుత్‌శక్తి ప్రవేశించింది.

ఒక వ్యక్తి...ఒక గాంధీ..ఒక దేశం....

నరకాసురుణ్ణి, రావణాసురుణ్ణి చంపితే అది దుష్టశిక్షణౌతుంది. హత్యకాదు. నిర్మూలన ఎంత అవసరమో నిర్మాణకళ తెలిసినవాళ్ళకర్థమౌతుంది. పునర్నిర్మాణం నిర్మాణం కంటే ఎంతో క్లిష్టమైన క్రియ.

పిబిఎస్ ఒక తనిఖీ, నిఘా సంస్థగా రూపొందబోతోంది.

ఏ పదవులూ ఆశించని తమను ఎవరుమాత్రం ఎలా జయిస్తారు.

కిటికీలోనుండి పచ్చగా ఒక లేత గులాబీ ఆకు ఎంతో అందంగా కనిపిస్తోంది తేజకు ఆక్షణం.

* * *

ఎంత అందమైన కలువైనా, కమలమైనా తప్పనిసరిగా బురదలో నుండే పుట్టాలికదా..,

'స్వాతి' వారపత్రిక